సాక్షి
నిర్మల్
బుధవారం । 5 । జూలై । 2023

బడికి నిధులు..!

సర్కారు బడుల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పాఠశాల శుభ్రత, ఇతర నిర్వహణకు ప్రభుత్వం మొదటి విడత నిధులు ఈ నెల 3న విడుదల చేసింది.



8లో▸



'అల్లూరి' స్ఫూర్తితో ముందుకెళ్లాలి

అల్లూరి సీతారామరాజు జయంతిని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అల్లూరి పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని పలువురు సూచించారు.

9లో▸

గరిష్టం/కనిష్టం
31.6/24.2

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వాతావరణం చల్లబడుతుంది. అల్పపీడన ద్రోణి ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టర్ క్షేత్ర పర్యటన



పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ వరుణ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. అభివృద్ధి పనులు, ధర్మసాగర్ కట్టపై చేపట్టే పనుల గురించి అధికారులకు సూచనలు చేశారు. పట్టణ శివారులోని డంపింగ్ యార్డును, పట్టణంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించారు.

తప్పుడు సర్వేపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఖానాపూర్: డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన జాబితాలో అనర్హులకు చోటు కల్పించిన తప్పుడు సర్వేపై విచారణ చేయాలని పలువురు బాధితులు కోరారు. ఈమేరకు కలెక్టర్ వరుణ్‌రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. పట్టణంలోని 400 డబుల్‌బెడ్ రూం ఇళ్లకు సంబంధించి రెండుసార్లు లక్కీడ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ అందులో సగానికి పైగా అనర్హులే ఉన్నారని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. సమగ్ర విచారణ చేయాలని డిమాండ్‌చేశారు. ఫిర్యాదు చేసినవారిలో కరిపె రాజశేఖర్, మజీద్‌ఖాన్, సట్ల శంకర్, బొప్పారపు శ్రీనివాస్, మున్నిబేగం, టిట్టుమణి, స్వప్నదేవి, సునీత, సహారబేగం ఉన్నారు.

కడెం వాసికి ఇంపాక్ట్ ట్రైనర్ సర్టిఫికెట్



సర్టిఫికెట్ అందుకుంటున్న వెంకటేశ్

కడెం: ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 2న హైదరాబాద్‌లోని మినర్వా హోటల్‌లో కడెం మండలం కొండుకూర్ గ్రామానికి చెందిన లింగాల వెంకటేశ్ ఇంపాక్ట్ ట్రైనర్‌గా సర్టిఫికెట్ అందుకున్నాడు. 'ఇంటికో స్పీకర్.. ఊరికో ట్రైనర్' కార్యక్రమంలో భాగంగా నెల రోజులపాటు ప్రముఖ సైకాలజిస్ట్ గంపా నాగేశ్వర్‌రావు తదితరులతో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించి, అందులో ప్రతిభ కనబర్చిన స్పీకర్లకు ఈనెల 1, 2 తేదీల్లో ట్రైనర్ సర్టిఫికెట్లు అందజేశారు.

గిరిజనులకే పోడు పట్టాలు

సారంగపూర్: అటవీ భూముల్లో గత కొన్నేళ్లుగా సేద్యం చేస్తున్న గిరిజనులకు మాత్రమే పోడు పట్టాలు పొందే అర్హత ఉందని ఎస్సీ, బీసీ కులాలకు లేదని ఎఫ్ఆర్‌వో జైపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొట్ల(బి) గ్రామ శివారులోని 1039 కంపార్టుమెంట్‌లో స్వర్ణ, కొట్ల(బి) గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీలు సాగు చేసేందుకు యత్నిస్తున్నారని అందిన సమాచారంతో సారంగాపూర్ ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి సహకారంతో అటవీశాఖ సిబ్బంది మంగళవారం పహారా నిర్వహించారు. అనంతరం గ్రామంలోకి వెళ్లి అవగాహన కల్పించారు. ఎఫ్ఆర్‌వో మాట్లాడుతూ 2014లో కొట్ల(బి), స్వర్ణ గ్రామాలకు చెందిన ఎస్సీ, బీసీ కులాల వారు 334 హెక్టార్లలో అటవీభూమి ఆక్రమించుకుని సేద్యం చేయగా అప్పట్లో అడ్డుకున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేస్తుందని మళ్లీ సాగుక యత్నిస్తున్నా రని తెలిపారు. కార్యక్రమంలో మామడ ఎఫ్ఆర్‌వో అవినాష్, స్క్వాడ్ ఎఫ్ఆర్‌వో రమేశ్‌రావు, భైంసా ఎఫ్ఆర్‌వో రమేశ్‌రాథోడ్, దిమ్మదుర్తి ఎఫ్ఆర్‌వో పుండలీక్‌రావు, డిప్యూటీ రేంజ్ అధి కారి శ్రీదేవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'కడెం'పై ప్రభుత్వం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు

కడెం: రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకునే బీఆర్ఎస్ ప్రభుత్వం కడెం ప్రాజెక్టును పట్టించుకోకపోవడం సిగ్గుచేటని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. కడెం ప్రాజెక్టును మంగళవారం సందర్శించారు. గతేడాది వానాకాలంలో భారీ వరదలతో ప్రాజెక్టు దెబ్బతిన్నదని, ఏడాది గడుస్తున్నా మరమ్మతులు పూర్తి చేయించలేదని విమర్శించారు. సకాలంలో నిధులు విడుదల చేయించి, మరమ్మతు పనులు పూర్తి చేయించడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు.



ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

ట్రిపుల్ సీట్లలో మనోళ్ల సత్తా!

- ఉమ్మడి జిల్లా నుంచి రికార్డు స్థాయిలో 149 మంది ఎంపిక
- ఒక్క నిర్మల్ జిల్లా నుంచే 92 సీట్లు
- బాసర మండలం నుంచే 15 మందికి అవకాశం

భైంసా: చదువుల తల్లి నిలయమైన నిర్మల్ జిల్లా మరోమారు సత్తాచాటింది. ఈయేడు పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానం సాధించిన జిల్లా విద్యార్థులు ట్రిపుల్‌ఐటీ ప్రవేశాల్లోనూ ఈసారి సత్తా చాటారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈయేడు నిర్మల్ జిల్లాకు చెందిన 92 మంది విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీలో సీట్లు దక్కాయి. బాసర సరస్వతీదేవి కొలువై ఉన్న జిల్లా తొలిసారిగా అత్యధికంగా సీట్లు సాధించింది. రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచింది.

సత్తాచాటిన సర్కారు బడి విద్యార్థులు..

జిల్లాలోని 18 మండలాల పరిధిలో 166 ప్రభుత్వ బడులు ఉన్నాయి. 93 పాఠశాలల్లో 100 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లావ్యాప్తంగా 80 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. జిల్లాలోని 14 కస్తూరిబా పాఠశాలల్లో 100 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులంతా సర్కారు బడుల్లోనే చదివారు. సర్కారు బడుల్లో చదివిన విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీలోనూ సీట్లు వచ్చాయి. ట్రిపుల్‌ఐటీ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఇంత మొత్తంలో ఎన్నడూ సీట్లురాలేదు.

కుంటాల ఆదర్శ పాఠశాల నుంచే 17 మంది..

కుంటాల: బాసర ట్రిపుల్‌ఐటీకి కుంటాల ఆదర్శ పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లాలో అత్యధికంగా కుంటాల మండలానికి చెందిన 19 మంది విద్యార్థులు సీట్లు సాధించారు.

జేఈఈ మెయిన్స్‌కు ఒక విద్యార్థి..

స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్ పూర్తిచేసిన అరవింద్ జేఈఈ మెయిన్స్‌కు ఎంపికయ్యారు. గుజరాత్‌లోని వడోదర కళాశాలలో కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో సీటు సాధించాడు.

ఉమ్మడి జిల్లాకు 149 సీట్లు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 149 మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటీలో సీట్లు దక్కించుకున్నారు. నిర్మల్ జిల్లాలో 92 మంది, ఆదిలాబాద్ నుంచి 29, మంచిర్యాల నుంచి 24, కుమురంభీం ఆసిఫాబాద్ నుంచి నలుగురు సీట్లు దక్కించుకున్నారు. ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థులకు రాష్ట్రంలోనే బాసరలో ఉన్న ఏకైక ట్రిపుల్‌ఐటీలో సీట్లు దక్కడం అదృష్టంగా భావిస్తున్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులకు సీట్లు రావడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాసర మండలంలో 15 మందికి..

ఇక ట్రిపుల్ ఐటీ ఉన్న బాసర మండలానికి చెందిన 15 మంది విద్యార్థులు ఈయేడు అందులో సీట్లు దక్కించుకున్నారు. బాసర, కౌటతోపాటు ఆయా ప్రభుత్వ బడుల్లో చదివిన పిల్లలు ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. బాసర మండలంలోనే ఉన్న ఈ క్యాంపస్‌లో సీట్లు రావడంపై హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సీట్లు ఇలా...

జిల్లా	సీట్లు సాధించిన విద్యార్థుల సంఖ్య
నిర్మల్	92
ఆదిలాబాద్	29
మంచిర్యాల	24
ఆసిఫాబాద్	04

విద్యార్థులకు అభినందనలు

ట్రిపుల్‌ఐటీ ప్రవేశాలకు పదో తరగతిలో సాధించిన మార్కులే కొలమానం. సర్కారు బడుల్లో ఉత్తమ జీపీఏతో ఉత్తీర్ణత సాధిస్తే ట్రిపుల్‌ఐటీలో సీటు దక్కుతుంది. పదో తరగతి ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిచిన నిర్మల్ జిల్లా విద్యార్థులు ఈయేడు ట్రిపుల్‌ఐటీలోనూ 92 సీట్లు దక్కించుకున్నారు. ట్రిపుల్‌ఐటీలో ఎంపికైన విద్యార్థులందరికీ అభినందనలు. ఈ విద్యాసంవత్సరం కూడా ఇలాంటి ఫలితాలే సాధిస్తాం.

– రవీందర్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి..



ఉమ్మడి జిల్లాలో కుంటాల ఆదర్శ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఏటా మంచి ఫలితాలను సాధిస్తున్నాం. ఈ ఏడాది ట్రిపుల్‌ఐటీకి 17 మంది విద్యార్థులు, జేఈఈ మెయిన్స్‌కు ఒక విద్యార్థి ఎంపిక కావడం గర్వంగా ఉంది. ఈ ఏడాది కూడా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం.

– శ్రీనివాస్‌ప్రసాద్, ప్రిన్సిపాల్ ఆదర్శ పాఠశాల

సీఎం చొరవతో నెరవేరిన గిరిజనుల కల

- మంత్రి ఐకే రెడ్డి
- ఉట్నూర్‌లో లబ్ధిదారులకు పోడు పట్టాల పంపిణీ



మాట్లాడుతున్న మంత్రి ఐకే రెడ్డి

ఉట్నూర్‌రూరల్: పోడు పట్టాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న గిరిజనుల కల సీఎం కేసీఆర్ చొరవతో నెరవేరిందని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఉట్నూర్ వేదికగా మంగళవారం నిర్వహించిన పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం సంబురంగా సాగింది. స్థానిక కుమురంభీం ప్రాంగణంలో ఖానాపూర్, ఆసిఫాబాద్, బోథ్ నియోజకవర్గాల పరిధిలోని ఏజెన్సీ మండలాల గిరిజనులకు పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రేఖానాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి ఐకే రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేబీ ప్రాంగణంలోని కుమురంభీం విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుమురంభీం స్ఫూర్తితో సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని 1.52 లక్షల మంది గిరిజనులకు పోడు హక్కు పత్రాలు పంపిణీ చేసే కార్యక్రమానికి గత నెల 30న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో శ్రీకారం చుట్టారన్నారు. ఈ నెల 8వరకు రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులందరికీ హక్కు పత్రాల పంపిణీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో 12,222 కుటుంబాలకు 31,683 ఎకరాలు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 15,254 కుటుంబాలకు 44,750ఎకరాలు, మంచిర్యాల జిల్లాలో 2,403 కుటుంబాలకు 5024 ఎకరాలు, నిర్మల్ జిల్లాలో 7253 కుటుంబాలకు 20051 ఎకరాలకు అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులందరికీ రైతుబంధు సైతం అందించనున్నట్లు చెప్పారు. గిరి వికాసం పథకం ద్వారా త్రీఫేజ్ కరెంట్, బోరు మోటార్ సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

అడవులను నరకవద్దు..

అర్హులందరికీ పోడు పట్టాలు పంపిణీ చేస్తున్నామని, ఇక మీదట ఎవరూ అడవులను నరకవద్దని మంత్రి అన్నారు. అటవీ సరిహద్దుల్లో అటవీశాఖ అధికారులు అడవుల్లోకి ఎవరూ రాకుండా కందకాలు తవ్వుతారన్నారు. అటవీ సంరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలో 31వేల మందికి పోడు పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు రేఖానాయక్, రాథోడ్ బాపూరావు మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ గిరిజనుల బాధలు గుర్తించి పోడు హక్కు కల్పించారన్నారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే చేతుల మీదుగా పది మందికి పట్టాలు అందజేశారు. మిగతా వారికి ప్రాంగణం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ, మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, ఉట్నూర్ ఎంపీపీ జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాం, ఎస్సీ రెడ్డితో పాటు మాజీ ఎంపీ గోడం నగేశ్, ఏజెన్సీ ప్రాంతాల ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.



పోడు పట్టాలు అందుకున్న గిరిజనులు

ఓపీఎస్ సాధించుకుందాం

భైంసాటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానంపై పోరాడాల్సిన అవసరముందని టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు అన్నారు. సీపీఎస్ రద్దుపై సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి రథ యాత్ర చేపడుతున్నారని తెలిపారు. 20న యాత్ర జిల్లాకు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో భైంసాలోని ప్రభుత్వ జూనియర్, మైనార్టీ గురుకుల పాఠశాలలో మంగళవారం సభ్యత్వ నమోదు చేపట్టి, రథయాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కృష్ణారావు మాట్లాడుతూ.. రాష్ట్ర శాసన సభ రద్దులోగా సీపీఎస్ రద్దు చేయాలనే డిమాండ్‌తో చేపడుతున్న రథయాత్రకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి గడ్డం భూమన్న, గంగాధర్ భోస్లే, కొండ ప్రవీణ్, భూషణ్, సర్ఫరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందేలా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. సంబంధిత కార్యక్రమ నిర్వహణ అధికారులు, జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న పర్యవేక్షక సిబ్బంది కలిసి డివిజన్ల వారీగా వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కార్యక్రమాల్లో వెనుకబడి ఉన్నామో గుర్తించి దానికి కారణాలను విశ్లేషించి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున, వ్యాధులు ప్రబలకుండా నియంత్రణ, నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్, కమ్యూనిటీ అధికారులు గిరిబాబు, లక్ష్మి, కార్యాలయ సూపరింటెండెంట్ పురుషోత్తం, ఆరోగ్య విస్తరణ అధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు, సీనియర్ అసిస్టెంట్లు జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

దొడ్డి కొమురయ్యకు నివాళి

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మినీ కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి కలెక్టర్ వరుణ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశపాలన, దొరల దోపిడీకి వ్యతిరేకంగా కొమురయ్య పోరాడి అమరుడయ్యాడని తెలిపారు. ఆయన స్ఫూర్తితోనే తెలంగాణ పోరాటం ఉవ్వెత్తున ఎగిసిందని పేర్కొన్నారు.



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కళలకు పుట్టినిల్లు నిర్మల్

- ఆర్ఎంవో డాక్టర్ వేణుగోపాలకృష్ణ

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కళలకు పుట్టినిల్లని, జిల్లాకు చెందిన వ్యక్తులు షార్ట్‌ఫిలింలు, చలనచిత్రాలను తెరకెక్కించడం అభినందనీయమని జిల్లా ప్రాంతీయ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ వేణుగోపాలకృష్ణ అన్నారు. జిల్లాకేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అడిచెర్ల రాజు దర్శకత్వంలో రామేల్లి హరీశ్‌బాబు హీరోగా, నిర్మించిన 'వైదికం' షార్ట్ ఫిలిం ట్రైలర్‌ని విడుదల చేశారు. నిశ్చితార్థం, వివాహబంధాన్ని ఆధారంగా చిత్రం రూపొందించినట్లు దర్శకుడు అడిచెర్ల రాజు తెలిపారు. ఈ చిత్రంలో హీరోగా నిర్మల్‌కు చెందిన హరీశ్‌బాబు నటించగా, అతనితోపాటు మరికొన్ని ముఖ్య పాత్రల్లో డాక్టర్ వేణుగోపాల్, కడెంకు చెందిన జగదీష్, ఖానాపూర్‌కు చెందిన మోహన్‌రావు నటించారని నిర్మాత హరీశ్‌బాబు తెలిపారు. డాక్టర్ వేణుగోపాలకృష్ణ, డాక్టర్ కత్తి కిరణ్, కోటగిరి నరసయ్యచారి, సామెర్ల రాజన్న, శెట్టిపల్లి కమలాకర్, మారుతి కిరణ్, సూర్యప్రకాశ్, వంశీ, కాసం సంతోష్, సత్యం, శశాంక్, సాయి పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగు చేయాలి

లోకేశ్వరం: ఆయిల్‌పాం సాగుకు రైతులు మొగ్గుచూపాలని ఆయిల్‌పాం జిల్లా డీజీఎం రామ్మోహన్‌రావు అన్నారు. మండలంలోని మాల్యాపూర్, హవర్గ, బిలోలి గ్రామాల్లోని ఆయిల్‌పాం క్షేత్రాలను మంగళవారం పరిశీలించారు. ఆయిల్‌పాం సాగుతో వచ్చే లాభాలను రైతులకు వివరించారు. జిల్లాలో రూ.260 కోట్లతో ఆయిల్ పాం ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భైంసా ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు, లోకేశ్వరంక్లస్టర్ అధికారి శేఖర్, రైతులు ఉన్నారు.

- ఏజెన్సీ ప్రాంతాల్లో సమస్యల తిష్ట
- మౌలిక వసతులకూ నోచుకోని అడవిబిడ్డలు
- కొత్త పీవోపైనే గంపెడాశలు
- 'చాహత్'కు సవాలుగా గిరిజనం అవస్థలు



సిరికొండ మండలం కుంటగూడకు దారి ఇలా..

'గిరి' గోస తీరేనా?



నార్నూర్ మండలం నన్నూగూడ గర్భిణిని వాగు దాటిస్తున్న ఆశాకార్యకర్తలు (ఫైల్)

కైలాస్‌నగర్: గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించడంతో పాటు క్షేత్రస్థాయిలో వారి సమస్యలను పరిష్కరించాల్సిన గురుతర బాధ్యత ఐటీడీఏదే. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్ కేంద్రంగా ఇది పనిచేస్తోంది. కీలకమైన ఈ ఐటీడీఏకు 61వ ప్రాజెక్ట్ అధికారి(పీవో)గా చాహత్ బాజ్‌పాయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అయితే నాలుగు జిల్లాల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గల సమస్యలు ఆమెకు స్వాగతం పలుకుతున్నాయి. నిజాయతీ, ముక్కుసూటిగా విధులు నిర్వహిస్తారనే పేరు పొందిన ఆమెపై గిరిజనం గంపెడాశలు పెట్టుకున్నారు. తన ముందున్న సమస్యలను ఏ విధంగా అధిగమించి గిరిపుత్రులకు అండగా నిలుస్తారనే దానిపై చర్చ సాగుతోంది. కొత్త పీవోకు సవాలుగా మారనున్న ఉమ్మడి జిల్లాలోని సమస్యలను ఓ సారి పరిశీలిస్తే..

విద్య, వైద్యంకు తప్పని తిప్పలు

మనిషి సామాజికంగా అభివృద్ధి సాధించాలన్నా, ఆరోగ్యంగా జీవించాలన్నా విద్య, వైద్యం ఎంతో కీలకం. అయితే ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు ఇవి ఏళ్లుగా అందని దుస్థితి. ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో ఇప్పటికీ సరైన వసతుల్లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ చాలా పాఠశాలల్లో అమలుకు నోచుకోని పరిస్థితి. దీంతో విద్యార్థులు అర్ధాకలితో చదువుకోవాల్సి వస్తోంది. గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు పలు చోట్ల తమకు బదులుగా ఇంటర్మీడియెట్, పదో తరగతి చదువుకున్న వారిని నియమించుకుని విధులకు ఎగనామం పెడుతుండడం గమనార్హం. అధికారుల పర్యవేక్షణ తీరుకు నిదర్శనమిది.

- వైద్యం విషయానికి వస్తే వర్షాకాలం వచ్చిందంటే చాలు అనేక గ్రామాల్లోని వాగులపై వంతెనలు లేక రోడ్లు తెగిపోయి బాహ్య ప్రపంచంతో రోజుల తరబడి సంబంధాలు తెగిపోయే పరిస్థితి. ఇలాంటి గ్రామాల్లో అత్యవసరమైన పరిస్థితి ఏర్పడితే ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోతుంది. వర్షాకాలంలో అంటు వ్యాధుల సంగతి సరేసరి. పారిశుద్ధ్యం, తాగునీరు సక్రమంగా అందక ఏటా సీజనల్ వ్యాధులు ప్రబలి గిరిజనం మంచాన పడడం షరా మామూలే. సకాలంలో వైద్యం అందక మృత్యుఒడిని చేరిన పరిస్థితులూ లేకపోలేదు.

వేధిస్తున్న రక్తహీనత

ఆదివాసీ మహిళలు, యువతులను రక్తహీనత సమస్య తీవ్రంగా వేదిస్తోంది. ముఖ్యంగా ప్రసవం కోసం రిమ్స్‌ను సందర్శించే వారిలో అధికశాతం మంది ఈ సమస్యతోనే బాధపడుతుండడం గమనార్హం. సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడం, అవగాహన లేకపోవడం సమస్యకు కారణంగా నిలుస్తోంది. సకాలంలో రక్తం అందక ప్రసవానికి వచ్చిన గర్భిణి బిడ్డతో సహా మరణించిన సంఘటనలు సైతం ఉన్నాయి. ఇలాంటి దుస్థితిని దూరం చేసి వారికి పౌష్టికాహారం అందించేలా చూడాల్సిన అవసరం ఉంది. చాలామంది మహిళలు ఇప్పటికీ సకాలంలో ఏఎన్‌సీ పరీక్షలు చేసుకోకపోవడం, కొన్ని గూడేల్లో ఇంకా ఇంటి వద్దే డెలివరీలు జరుగుతుండటంతో మాతా శిశు మరణాలు ఆగని పరిస్థితి. ఫలితంగా మాతృత్వం అనుభవించేలోపే మహిళలు మృత్యుఒడికి చేరాల్సి వస్తోంది.

తాగునీటికీ.. తంటాలే

మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి శుద్ధజలం అందిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అనేక గూడేలు, తండాలకు ఇప్పటికి తాగునీరు అందడం లేదు. ఇప్పటికీ చాలాచోట్ల బావులు, చెలిమే నీరే దిక్కవుతోంది. ముఖ్యంగా వేసవి, వర్షాకాలంలో తాగునీరు అందక గిరిజనుల అవస్థలు వర్ణనాతీతమే.

రోడ్డు సౌకర్యం లేని గ్రామాలెన్నో..

ఉమ్మడి జిల్లాలోని అనేక గిరిజన గూడేలకు ఇప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేదు. దీంతో గిరిజనులకు కాలినడకే దిక్కవుతోంది. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు సైతం రాని దుస్థితి. దీంతో సకాలంలో వైద్యం అందని పరిస్థితి. అలాగే రేషన్ సరుకులు, ఇంటికి అవసరమైన వస్తువులను నెత్తిపైన పెట్టుకొని తీసుకెళ్లడంలో గిరిపుత్రుల అవస్థలు అన్నీ ఇన్ని కావు.

పోడు... గోడు తీరేనా?

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులను ఏళ్లుగా పోడు సమస్య వేధిస్తోంది. ప్రభుత్వం తాజాగా ఆర్‌వోఎఫ్ఆర్ కింద పట్టాలు జారీ చేస్తున్నప్పటికీ దరఖాస్తుదారుల సంఖ్యకనుగుణంగా అవి ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఏళ్లుగా భూములను సాగు చేస్తున్నప్పటికీ పట్టాలు అందని గిరిజనులు మళ్లీ ఆందోళన బాట పట్టే ప్రమాదం లేకపోలేదు. సోమవారం కలెక్టరేట్, ఐటీడీఏలో నిర్వహించిన ప్రజావాణిలో దీనిపై పదుల సంఖ్యలో గిరిజన, గిరిజనేతరులు వినతిపత్రాలు అందజేయడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఆర్డీవో విజయలక్ష్మి

కడెం: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఇళ్ల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం కడెం ప్రాజెక్ట్ వద్ద ఏర్పాటు చేయనున్న సంపద వన స్థలాన్ని గుర్తించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో ఉపేందర్, ఏపీవో జయదేవ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

క్లుప్తంగా

ట్రిపుల్‌ఐటీ వీసీని కలిసిన టీఎస్‌ఐసీ బృందం



వీసీతో మాట్లాడుతున్న టీఎస్‌ఐసీ బృందం

భైంసా: ఇంటింటా ఇన్నోవేషన్ అనే కార్యక్రమంలో భాగంగా టీఎస్‌ఐసీ (తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్) బృందం బాసర ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణను మంగళవారం కలిశారు. క్యాంపస్ విద్యార్థులతో మాట్లాడారు. వచ్చే నెలలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్మల్ జిల్లాలో ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ నూతన ఆవిష్కరణలను ప్రదర్శించేందుకు విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని కోరారు. ఇంక్యుబేషన్ ఇన్నోవేషన్ సెల్ కోఆర్డినేటర్ రాకేశ్‌రెడ్డి, స్వప్నిల్, అసోసియేట్ డీన్ సృజన, డాక్టర్ పావని, డీన్ డాక్టర్ చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరి గ్రామాల్లో వనదేవతకు పూజలు



వనదేవతకు పూజలు చేస్తున్న గిరిజనులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని గోండ్‌గూడతో పా టు మండలంలోని వడగామ్, శంకర్‌గూడ గ్రామాల్లో మంగళవారం వనదేవత (అకాడి) పూజలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల ఆదివా సీ గిరిజనులు గ్రామ పొలిమెరలోని అటవీ ప్రాంతానికి వెళ్లి వన దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. చిరుధాన్యాలతో నైవేద్యాలు తయారు చేసి వన దేవతలకు సమర్పించారు. పశువులకు అడవి జంతువులతో ఎలాంటి హాని జరగకుండా ఉండాలని మొక్కుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనలు చేశారు. ఆయా గ్రామల పెద్దలు చహకటి నాగోరావ్, ఆత్రం ఆశోక్, ఆత్రం నాగోరావ్, మడావి ఇంద్రు ఉన్నారు.

గుడుంబా పట్టివేత

సిరికొండ: మండలంలోని గుడుంబా స్థావరాలపై పోలీసులు వరుసదాడులు చేస్తున్నారు. మండలంలోని చిమ్మన్‌గూడిలో సోమవారం ఓ వ్యక్తిని పట్టుకున్న విషయం తెలిసిందే. మరుసటి రోజే మంగళవారం అదే గ్రామానికి చెందిన జాదవ్ జయశ్రీ ఇంట్లో సోదాలు నిర్వహించగా రూ.3500 విలువ గల ఏడు లీటర్ల గుడుంబాను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నీరేశ్ తెలిపారు.

బడికి నిధులు..!

- నిర్వహణ కోసం మొదటి విడత విడుదల
- ప్రాథమిక పాఠశాలలకు రూ.5 వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.10 వేల చొప్పున కేటాయింపు
- క్రీడా నిధులు సైతం మంజూరు



మంచిర్యాలలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల

మంచిర్యాలఅర్బన్:సర్కారు బడుల నిర్వహణకు ప్రభుత్వం మొదటి విడత నిధులు విడుదల చేసింది. ఈ ఏడాది జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు బడిబాట పట్టారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం సుద్దముక్క (చాక్‌పీస్) కొనుగోలుకు కూడా పైసలు లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వ పాఠశాలలను నిధుల కొరత వేధిస్తోంది. దశాబ్ది ఉత్సవాల్లోనైనా నిధులు సకాలంలో విడుదలవుతాయని ఆశించినా ఫలితం లేకుండా పోయింది. మరోవైపు అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు, ఫ్లెక్సీలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే సొంత డబ్బులు వెచ్చించారు. ఎట్టికేలకూ ఈ విద్యాసంవత్సరం 2023–24లో పాఠశాల శుభ్రత, ఇతర నిర్వహణకు ప్రభుత్వం మొదటి విడత నిధులను ఈ నెల 3న విడుదల చేసింది. ఆయా పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్యను బట్టి తొలి విడతగా 50 శాతం నిధులు మంజూరయ్యాయి.

నిధుల మంజూరు ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి బడి నిర్వహణ నిధులు మంజూరు చేస్తోంది. రెండు విడతల్లో నిధులు కేటాయిస్తారు. సుద్దముక్కలు (చాక్‌పీస్)లు, తరగతి గదులు శుభ్రం చేసే చీపుర్లు, రిజిస్టర్లు, ఇతర ఖర్చుల కింద నిధులు వినియోగి స్తారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు కేటాయించారు. 1 నుంచి 30 మంది విద్యార్థులకు రూ. 10 వేలు, 31 నుంచి 100 మందికి రూ.25 వేలు, 101 నుంచి 250 మందికి రూ.50వేలు, 251 నుంచి వెయ్యి మందికి రూ.75వేలు, వెయ్యికి పైగా విద్యార్థులకు రూ.లక్ష చొప్పున మంజూరు చేయాల్సి ఉంది.

క్రీడా నిధులొచ్చాయ్..

స్కూల్ గ్రాంటు నిధులతో పాటు ప్రభుత్వం స్పోర్ట్స్ గ్రాంటు నిధులు కూడా విడుదల చేయడం క్రీడాకారులకు ఉపశమనం కలిగిస్తోంది. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రాంటు యుటిలైజేషన్ గైడ్‌లైన్స్ జారీ చేసింది. 1 నుంచి 5వ తరగతి, 6 నుంచి 8వ తరగతి, 9 నుంచి 12వ తరగతికి సమగ్ర శిక్ష కింద ఇండోర్, అవుట్‌డోర్ గేమ్‌ల కోసం క్రీడా పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. క్రికెట్ బ్యాట్లు, వికెట్లు, సాఫ్ట్‌బాల్, టెన్నిస్ బాల్, ప్లాస్టిక్ బాల్స్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, బీన్‌బ్యాగ్స్, సాకర్‌కోన్, షాట్‌పుల్, డిస్కస్, ఫోమ్ జావెలిన్ తదితర పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. క్రీడా పరికరాలతో పాటు అదనంగా స్కిప్పింగ్ రోల్, వాలీబాల్, త్రోబాల్, ఫస్ట్‌ఎయిడ్ కిట్‌లను కొనుగోలు చేయాల్సి ఉంటుందని మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ప్రాథమిక పాఠశాలలకు రూ.5 వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.10 వేల చొప్పున నిధులు కేటాయించారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన క్రీడా నిధులు మొదటి విడతలో 50 శాతం మంజూరయ్యాయని జిల్లా విద్యా శాఖ అధికారి యాదయ్య తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో స్పోర్ట్స్ నిధులు

జిల్లా	స్కూల్స్	మొత్తం నిధులు	మొదటిదఫా మంజూరు
ఆదిలాబాద్	1,098	రూ.65,30,000	రూ.32,65,000
కుమురంభీం	937	రూ.54,30,000	రూ. 27,15,000
నిర్మల్	719	రూ.45,50,000	రూ.22,75,000
మంచిర్యాల	720	రూ.45,60,000	రూ.22,80,000

స్కూల్ గ్రాంటు నిధులు

జిల్లా	స్కూల్స్	మొత్తం నిధులు	మొదటిదఫా మంజూరు
మంచిర్యాల	720	రూ.1,51,70,000	రూ.75,85,000
ఆదిలాబాద్	1,098	రూ.2,31,45,000	రూ.1,15,72,500
కుమురంభీం	937	రూ.1,81,40,000	రూ.90,70,000
నిర్మల్	719	రూ.1,79,50,000	రూ.89,75,000

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ చేసిన ఎమ్మెల్యే



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని పౌర సరఫరాల మండల లేవల్ స్టాకిస్ట్ పాయింట్ ద్వారా సబ్ కాంట్రాక్టర్ వాహనాల్లో రేషన్ బియ్యం తరలిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సబ్ కాంట్రాక్టర్‌కు చెందిన లారీల్లో బియ్యం లోడ్ చేస్తుండగా సంబంధిత ఇన్‌చార్జి ఇస్తారిని నిలదీశారు. 2021 సెప్టెంబర్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్వహించిన వాహనాల టెండర్లలో ఆదిలాబాద్‌కు చెందిన అలిషా గొలాని టెండర్ దక్కించుకున్నాడని, ఉట్నూర్‌కు చెందిన సబ్ కాంట్రాక్టర్ వద్ద కమీషన్‌పై టెండర్‌లో చూయించిన పెద్ద వాహనాలకు బదులు ఇతర వాహనాలను ఏర్పాటు చేసుకుని అక్రమాలకు పాలపడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఉట్నూర్ ఎంఎల్ఎస్ పాయింట్ ద్వారా ప్రతీ నెల 8వేల క్వింటాళ్ల బియ్యం ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాల్లోని 72 చౌకధరల దుకాణాలకు సరఫరా చేయాల్సి ఉండగా సబ్ కాంట్రాక్టర్ ద్వారా వాహనాలు పెట్టి జిల్లా అధికారులతో పాటు స్థానిక అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు అర్థమవుతోందని ఎమ్మెల్యే మండిపడ్డారు. వెంటనే ఎంఎల్ఎస పాయింట్‌లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే ఫోన్‌లో కోరారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా...

నార్నూర్: ఉట్నూర్ ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి టెండర్‌లో చూపిన వాహనాలు కాకుండా ప్రైవేట్ వాహనాల్లో తరలిస్తున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ మంగళవారం వాహనాలను తనిఖీ చేసి కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేసింది. అయినా పట్టించుకోకుండా ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి మళ్లీ అదే ప్రైవేట్ వాహనాల్లో బియ్యాన్ని నార్నూర్ మండలం సుంగాపూర్ గ్రామానికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఉట్నూర్ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌డీ రషీద్, బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు జవార్ ఆన్సారీలు తాడిహత్నూర్ గ్రామం వద్ద ఆ వాహనాన్ని అడ్డుకుని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

- కలెక్టర్ రాహుల్ రాజ్



కలెక్టర్‌కు వివరాలు తెలియజేస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: ఆదివాసీ గిరిజన మహిళపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని చించోలి(బి) గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన మహిళపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని, ఇల్లు నిర్మిచడంతో పాటు ఆర్థిక సహాయం, భీంరావుకు హైదరాబాద్‌లో చదివించేలా చర్యలు చేపడతామన్నారు. ఆ కుటుంబ సభ్యుల వివరాలను గ్రామస్తుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఐటీడీఏ ఏపీఓ ఆత్రం భాస్కర్, సర్పంచ్ జంగు, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్ సింగ్, ఉప సర్పంచ్ ఏలేటి దేవేందర్ రెడ్డి ఉన్నారు.

ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు జగన్ సింగ్



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు జగన్‌సింగ్

ఎదులాపురం: కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మికులంతా ఐక్యంగా పోరాటాలు నిర్వహించి హక్కులు సాధించుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు జగన్ సింగ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గాన్ని నిలువు దోపిడీకి గురి చేస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కార్మికులకు కనీస వేతనాలు లేవని, ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి బేసిక్ వేతనాన్ని నిర్ణయించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ ప్రయోజనాలను పెంచాలని, కార్మికులు సహజ మరణం పొందితే రూ.5 లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.10 లక్షలు అందించాలన్నారు. కార్మికుల కుటుంబ ఆడ బిడ్డకు పెళ్లి కానుక, ప్రసూతి కానుక లక్ష రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై, లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కార్యవర్గం చలో హైదరాబాద్ పిలుపునిచ్చిందని, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనివిజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సుభాష్, నాయకులు నితిన్, నారాయణ, రాజు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

రైల్వే లైన్ సర్వే పనులు వేగవంతం చేయాలి

- రైల్వే బోర్డు ఛైర్మన్‌ను కలిసిన ఎంపీ సోయం



కేంద్ర రైల్వే బోర్డు ఛైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ –ఆర్మూర్ రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు కోరారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర రైల్వే బోర్డు ఛైర్మన్, సీఈఓ ఎస్‌హెచ్. అనిల్ కుమార్ లోహటిను కలిశారు. జిల్లాలోని ప్రధానమైన రైల్వే సమస్యలను వివరించి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా పటాన్‌చెరువు వరకు జాతీయ రహదారికి ప్రత్యామ్నాయంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే లైన్ పనులను వేగవంతం చేయాలని కోరారు. 2017లో మంజూరైన ఆదిలాబాద్ –పటాన్‌చెరువు వరకు రైలు మార్గం సర్వే పనులను పూర్తి చేయాలన్నారు. దీంతో ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల ప్రజలకు రైలు సౌకర్యం కలుగుతుందన్నారు.

జిల్లాలో ప్రధాని మోడీ పర్యటనను నిర్వహించాలి..

ఆదిలాబాద్: జిల్లాలో ప్రధాని మోడీ పర్యటన నిర్వహించాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. మంగళవారం ఢిల్లీలో రాష్ట్ర బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ చుగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధాని నరేంద్ర మోడీ పాలనతో ప్రజల్లో బీజేపీ పార్టీపై విశ్వాసం మరింతగా పెరిగిందన్నారు. ఆయన వెంట దక్షిణమధ్య రైల్వే బోర్డు మెంబర్ జివి రమణ, రాళ్లబండి మహేందర్ ఉన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నిర్మల్‌చైన్‌గేట్:రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు సాదం అరవింద్ ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కుటుంబ పాలనను అంతం చేయాలని, అందుకోసం వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీని గెలిపించాలన్నారు. పేద ప్రజల కోసం ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికీ చేరవేయడమే ప్రతీ కార్యకర్త లక్ష్యమన్నారు. కరోనా సమయంలో వ్యాక్సిన్, ఉచిత రేషన్ బియ్యం లాంటివి ప్రజలకు అందజేశారన్నారు. కుటుంబ పాలన అంతమొందించాలంటే భారతీయ జనతా పార్టీలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రామ్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మ రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు కమల్ నయన్, అలివేలు మంగ, జిల్లా కార్యదర్శి గాదె విలాస్, దళితమోర్చా జిల్లా అధ్యక్షులు రాచకొండసాగర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రజిని వైద్య, అసెంబ్లీ కన్వీనర్ మురళీ, జెడ్పీటీసీ రమణారెడ్డి ఉన్నారు

మంత్రిని కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం

నిర్మల్‌చైన్‌గేట్:ఇటీవల నూతనంగా ఎన్నికైన నాయిడివాడ పంచశిల్పి విశ్వబ్రాహ్మణ సంఘ కార్యవర్గం మంగళవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రానున్న రోజుల్లో సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మంత్రిని కలిసినవారిలో అధ్యక్ష కార్యదర్శులు వడుకపురం శ్రీనివాస్, పొలాస భరత్, సింహారాజు సాగర్, కోటగిరి అశోక్, మేడారం ప్రదీప్, కట్టా నాగాచారి, మనోహర్‌చారి, టి.శ్రీనివాస్, అశోక్, ప్రకాశ్, కృష్ణ, నరేష్, ఆనంద్, సాయి, ప్రసాద్, అనిల్, విజయ్, చారి ఉన్నారు.

మొలకెత్తని సోయా విత్తనాలు

- ఆందోళనలో రైతులు



విత్తన కంపెనీ బ్యాగును చూపిస్తున్న రైతులు

బోథ్: గ్రీన్‌గోల్డ్ కంపెనీకి చెందిన సోయా విత్తనాలు మొలకెత్తలేదని రైతులు వాపోతున్నారు. పది రోజుల క్రితం మండలంలోని దాదాపు 150 మంది రైతులు గ్రీన్‌గోల్డ్ కంపెనికి చెందిన విత్తనాలు వేశామని రైతులు తెలిపారు. ఎంతకూ మొలకలు రాలేదని వారు వాపోయారు. ఈ విషయమై వ్యవసాయాధికారి వెండి విశ్వామిత్రను సంప్రదించగా...విత్తనాలను విత్తిన ఏడు రోజులకు మొలకలు వస్తాయని తెలిపారు. రైతుల చేలను పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు ఐదుగురు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా వ్యవసాధికారులు మొలకశాతాన్ని చూడకుంగా, ప్రయోగాలు జరపకుండా కంపెనీకి చెందిన లాట్ నంబరు 202213ఆ32217 మార్కెట్‌లోకి విడుదల చేశారని కాంగ్రెస్ నాయకులు చంటి, రమేష్, అనీష్‌లు ఆరోపించారు. నష్టపోయిన రైతాంగానికి రూ. 25వేల నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్

ఆదిలాబాద్‌రూరల్: బీజేవైఎం నాయకులను మావల పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదినం సందర్భంగా దుర్గానగర్ కాలనీలో దుర్గామాతాను దర్శించుకోవడానికి నోటు పుస్తకాల పంపిణీకి అయన వస్తున్నారని తెలుసుకున్న బీజేవైఎం నాయకులు ఎమ్మెల్యే కాన్వాయ్‌ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులకు సమాచారం రావడంతో అరుగురిని ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన్నట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు.

పిడుగుపాటుకు ఒకరికి గాయాలు



గాయాలపాలైన ముత్తన్న

నేరడిగొండ: పిడుగుపాటుతో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని కుమారి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిమ్మల ముత్తన్న తన వ్యవసాయ క్షేత్రంలో ఎద్దులను మేతకు తీసుకువెళ్లాడు. ఆ సమయంలో వర్షంతో పాటు పిడుగు పడడంతో చేతులకు, కాలుకు గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

బజార్‌హత్నూర్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని కొలారి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సయ్యద్ ముజాహిద్ కథనం ప్రకారం.. కొలారి గ్రామానికి చెందిన రైతు తర్వే పుంజారాం(35) మంగళవారం తన పొలంలో సోయ పంటకు నీటిని పట్టేందుకు మోటార్ ఆన్‌చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు.



జిల్లా కేంద్రంలోని ధర్మసాగర్ మినీ ట్యాంక్ బండ్ వాకింగ్‌ట్రాక్ పరిస్థితి



వాకింగ్ ట్రాక్‌పై మందుసీసాలు



ఇదీ ఓపెన్‌జిమ్ దుస్థితి..

రక్షించలేక.. లక్షలు వృథా!

నిర్మల్: నిర్మల్ జిల్లా అభివృద్ధికి మంత్రి ఐకే రెడ్డి కృషి చేస్తున్నప్పటికీ కిందిస్థాయిలో అమలు కావడం లేదు. నిర్మల్ మున్సిపాలిటీ నిర్లక్ష్యంతో నిధులు నీటిపాలవుతున్నాయి. ఆరంభ శూరత్వం.. అన్నట్లు అభివృద్ధి పనులను ఆడంభరంగా ప్రారంభిస్తూ అనంతరం గాలికి వదిలేస్తోంది. ఇందుకు జిల్లా కేంద్రంలోని ధర్మసాగర్ మినీట్యాంక్ బండ్ ఉదాహరణ. ప్రజల ఆరోగ్యం కోసం రూ.లక్షలు ఖర్చు చేసి వాకింగ్‌ట్రాక్, ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేయగా మున్సిపాలిటీ నుంచి కనీస పర్యవేక్షణ, రక్షణ చర్యలు లేక ఎలా అధ్వానంగా తయారయ్యాయో ఈ చిత్రాలే 'సాక్షి'గా నిలుస్తున్నాయి.





ఆస్పత్రుల వ్యర్థాలతో..



మురుగునీటిమయం..